www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 18 జూన్ 2023

5

కాకినాడ



ప్రతి సోమవారం డయల్ యువర్ కమిషనర్

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి సోమవారం ఉదయం 9:30 గంటల నుంచి 10:30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ చెప్పారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయం ఫోన్ నెంబర్ 08842357800 నెంబర్‌కు కాల్ చేసి సమస్యలు తెలియజేయవచ్చునన్నారు. ప్రజలు తమ దష్టికి తీసుకువచ్చిన సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ చెప్పారు. 10:30 నుంచి స్పందన కార్యక్రమం యథావిధిగా కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పాఠ్య పుస్తకాల ధరలకు రెక్కలు

- అధిక ధరలకు అమ్మకాలు
- విద్యా హక్కు చట్టానికి తూట్లు
- పట్టని విద్యాశాఖ అధికారులు



ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

ప్రాథమిక విద్యకు సంవత్సరానికి రూ.45 వేల నుంచి రూ.80 వేలు వరకు ఫీజులు చెల్లిస్తున్నాం. ఇవే కాకుండా ఏడాది పొడవునా వివిధ కార్యక్రమాల పేరుతో మరో రూ.10 వేలు అదనంగా లాగుతున్నారు. పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలకు కలిపి రూ.6 వేలు నుంచి రూ.9,500 వరకూ ఖర్చు చేయాల్సి వస్తుందని, పుస్తకాలకు డబ్బులు తగ్గించాలని కోరినా యాజమాన్యాలు నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నాయని వివిధ విద్యాసంస్థల్లో చదువుతున్న పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ప్రైవేటు విద్యాసంస్థలు పాఠ్యపుస్తకాలను విక్రయించాలని నోట్ పుస్తకాలు ,ఇతర వస్తువులు అమ్మరాదని విద్యాశాఖ అధికారులు చెబుతున్నా యాజమాన్యాలు పెడ చెవినే పెడుతున్నాయి.

ఇష్టారాజ్యంగా ప్రైవేట్ విద్యాసంస్థలు

విద్యాహక్కు చట్టాన్ని పక్కన పెట్టిన జిల్లాలో పలు ప్రయివేటు విద్యా సంస్థలు నిబంధనలను విస్మరించి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. భారీగా ఫీజులు వసూలు చేస్తూ తల్లిదండ్రుల జేబులు కొల్లగొడుతున్నాయి. అదే సందర్భంలో పుస్తకాలను మా వద్దే కొనుగోలు చేయాలని తేల్చి భారీగా ధరలు నిర్ణయించి వసూలు చేస్తున్నారు. యథేచ్ఛగా అమ్మకాలు జరపడమే కాకు నోట్ బుక్స్, షూస్, టై, యూనిఫామ్ ఇలా విద్యార్థులకు కావాల్సిన అన్ని రకాల వస్తువులు అక్కడే కొనుగోలు చేయాలని స్పష్టం చేస్తున్నాయి. బయట కొనుగోలు చేసేవి ఇక్కడ చెల్లుబాటు కావని హెచ్చరిస్తున్నారు. అవసరం లేనివి కూడా కొనుగోలు చేయిస్తూ అందినకాడికి సొమ్ములు దండుకుంటున్నారని అనేకమంది తల్లిదండ్రులు తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు.

నిర్ణయించిన ధరలకే అమ్మాల్సి ఉంది

ప్రభుత్వ పాఠశాలలో 1నుంచి 10వ తరగతి వారికి ఉచితంగా, ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలలకు తరగతుల వారీగా ప్రభుత్వం పుస్తకాల ధరలను నిర్ణయించింది. 1 నుంచి 10వ తరగతి వరకు తెలుగు మీడియంకు రూ.326 నుంచి 657 వరకూ, ఇంగ్లీషు మీడియంకు రూ.280 నుంచి 674 వరకూ మాత్రమే పాఠ్యపుస్తకాలను విక్రయించాల్సి ఉంది. నిర్ణయించిన ధరలకు మించి ఎక్కువ రేట్లకు అమ్మితే ఆయా ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటామని అధికారులు చెబుతున్నారు. అయితే పలు ప్రైవేటు విద్యాసంస్థలు ఫీజులు, డొనేషన్ల పేరుతో భారీగా సొమ్ములు దండుతున్నారు. బస్సు రవాణా ఛార్జీలను విడిగా వసూలు చేస్తున్నారు. అవే కాకుండా ప్రభుత్వం నిర్దేశించిన ధరలకు 10 నుంచి 20 శాతం అదనంగా పుస్తకాల కోసం వసూలు చేస్తున్నారు. ఒకటవ తరగతి నుంచి పదవ తరగతి వరకు రూ.4,500 నుంచి రూ.8 వేలు పైనే బాదేస్తున్నారని తల్లిదండ్రులు వాపోతున్నారు.

అధిక ధరలకు పుస్తకాల అమ్మకాలు

విద్య హక్కు చట్ట ప్రకారం ప్రైవేట్ పాఠశాలలో పాఠ్యపుస్తకాలు, స్టేషనరీ అమ్మకాలు చేయకూడదు. కానీ చాలా పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు, స్టేషనరీ అధిక రేట్లకు అమ్ముకుంటున్నారు. ఏ పాఠశాల పేరు మీద ఆ పాఠశాల పుస్తకాలనే అమ్ముతూ తమ పాఠశాలల్లోనే పాఠ్యపుస్తకాలు కొనాలని తల్లిదండ్రులపై ఒత్తిడి చేస్తున్నారు.

- ఎం.సూరిబాబు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కాకినాడ జిల్లా.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటా

జనసేన అధినేత పవన్ కల్యాణ్



మృతుల కుటుంబాలతో మాట్లాడుతున్న పవన్ కల్యాణ్

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

'మీరంతా మా కుటుంబం, మీకు అండగా నిలబడటం మా బాధ్యత అని, ఒక కుటుంబంలో ఒక వ్యక్తి మరణిస్తే దానిని ఎవరూ తీర్చలేం కానీ మీకు ఏ కష్టం వచ్చినా ఆదుకుంటామని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ అన్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ప్రమాదవశాత్తు మరణించిన 48 క్రియాశీలక సభ్యుల కుటుంబాలతో ఆయన కాకినాడలో ఒక ప్రైవేటు హోటల్లో శనివారం సమావేశమయ్యారు. ఇటీవల ప్రమాదవశాత్తు మరణించిన ముగ్గురు జనసేన కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున బీమా చెక్కులు అందించారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ ఖజానాలో రూ.లక్షల కోట్లున్నా రాష్ట్ర ప్రభుత్వం చేయలేని పని, ఏ అధికారం లేకపోయినా జనసేన పార్టీ సమర్థ వంతంగా చేస్తోందన్నారు. పార్టీ క్రియాశీలక సభ్యులను సొంత కుటుంబ సభ్యులుగా భావించి ఆపత్కాలంలో ఆర్థికంగా ఆ కుటుంబాలకు అండగా నిలుస్తోం దన్నారు. ప్రమాదవశాత్తు ఏ క్రియాశీలక సభ్యుడు చనిపోయినా, గాయపడినా తక్కువ సమయంలో ఆర్థిక సాయం అందేలా చర్యలు తీసుకున్నామన్నారు. రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ పార్టీ క్రియాశీల సభ్యులకు ప్రమాద బీమా చేయించే ఆలోచన ఉన్నతమైనదన్నారు. 90 వేల మంది క్రియాశీలక సభ్యులుగా చేరితే, ఈ ఏడాది ఆ సంఖ్య 6.76 లక్షలకు చేరిందన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్, పిఎసి సభ్యుడు ముత్తా శశిధర్, పితాని బాలకృష్ణ, మేడా గురుదత్తప్రసాద్, బండారు శ్రీనివాస్, తుమ్మల బాబు,మాకినీడు శేషుకుమారి, పోలిశెట్టి చంద్రశేఖర్, సంగిశెట్టి అశోక్, వరుపుల తమ్మయ్య బాబు, పాటంశెట్టి సూర్యచంద్ర, వై.శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్వేషాలతో ప్రజలను రెచ్చగొడితే సహించం

ప్రజాశక్తి-కోటనందూరు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రాజా

రోడ్లపై లారీలో తిరుగుతూ కుల మతాల మధ్య విద్వేషాలు రేపి ప్రజలను రెచ్చగొడితే సహించేది లేదని రోడ్లు భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. శనివారం తుని మున్సిపాలిటీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మంత్రి రాజా మాట్లాడారు. రాష్ట్రం స్థితిగతులపై ఏమాత్రం అవగాహన లేకుండా రోడ్లపై తిరుగుతూ మాట్లాడుతున్న పవన్ కల్యాణ్ మాటలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. రాష్ట్రంలో హిందూ దేవాలయాలపై దాడులు ఎక్కువయ్యాయని, వాటిపై చర్యలు తీసుకోవడంలో జగన్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైనట్టు చెప్పడం హాస్యాస్పదమని అన్నారు. హిందూ సనాతన ధర్మాన్ని హిందువుల మనోభావాలను పూర్తిగా గౌరవించిన వ్యక్తి జగనే అన్నారు. 2014 నుంచి 2019 వరకు అమరావతి రాజధానిలో 45 హిందూ దేవాలయాలను కూల్చినప్పుడు ఎందుకు నోరు మెదపలేదని ప్రశ్నించారు. పవన్ కళ్యాణ్ ముఖ్యమంత్రి అవ్వాలని డిసైడ్ అయిపోయానని ఒకసారి, ఎంఎల్ఏగా గెలిపించాలని మరొకసారి మతిస్థిమితం లేకుండా మాట్లాడుతున్నారని రాజా విమర్శించారు. పవన్ కళ్యాణ్, చంద్రబాబు ఎప్పుడైనా అమరావతిలో ఒక రాత్రయినా కుటుంబంతో కలిసి ఉన్నారా అని ప్రశ్నించారు. హైదరాబాద్‌లో నివాసం ఉంటూ లాడ్జికి, గెస్ట్ హౌస్‌కు వచ్చినట్టుగా ఎన్నికల సమయాల్లో ఆంధ్ర రాష్ట్రానికి ఎన్నికల సమయంలో ఒకసారి వచ్చి సభలో సమావేశాల్లో మాట్లాడితే ప్రజలు ఛీకొడుతున్నారని అన్నారు.

కార్మికులను రెగ్యులర్ చేయాలి

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

పంచాయతీల్లో ఏళ్ల తరబడి పనిచేస్తున్న పంచాయతీ కాంట్రాక్ట్ కార్మికులు ఔట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని సిఐటియు నాయకుడు వెంకటరమణ డిమాండ్ చేశారు. పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరుతూ ఈ నెల 21న డిపిఒ కార్యాలయం వద్ద చేపట్టిన ధర్నాను జయప్రదం చేయాలని శనివారం ఆయన కార్మికులకు పిలుపు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులను పర్మినెంట్ చేస్తానని వైఎస్.జగన్ ఎన్నికలకు ముందు పాదయాత్ర సందర్భంగా కార్మికులకు హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చి నాలుగేళ్ళు అవుతున్నా ఈ ఊసే లేదన్నారు. పంచాయతీల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ కార్మికులందరినీ తక్షణమే పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కె.నాగేశ్వరరావు, కె.రాజు, జి.గంగరాజు మొదలైన వారు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యంపై చర్యలు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

కాకినాడ నగరపాలక సంస్థ పరిధిలో పారిశుధ్య సిబ్బంది తమ విధుల్లో నిర్లక్ష్యం వహించకుండా డ్రైనేజీలను ఎప్పటికప్పుడు సుబ్బరం చేస్తూ ఉరుగనీరును ప్రవహించేలా చూడాలని కమిషనర్ రావిరాల రమేష్ పేర్కొన్నారు. శనివారం ఆయన ఎంహెచ్ఒ, ఇఇ, ఎఇతో కలిసి పారిశుధ్య పనులను ఇంద్రపాలెం నుంచి పలు ప్రాంతాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మురుగునీరు ప్రవహించే అవుట్‌ఫాల్ వద్ద చెత్త ప్లాస్టిక్ వాటర్ బాటిల్ రెండు రోజుల్లో శుభ్రం చేయాలని నిర్లక్ష్యంపై చర్యలు తప్పమన్నారు.



కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న నాయకులు

సెజ్ పోరాట నేత సుబ్బిరెడ్డి మృతి తీరని లోటు

ప్రజాశక్తి- యు.కొత్తపల్లి

ఎస్ఇజెడ్ పోరాట పోరాట నాయకుడు పెనుమల్లు సుబ్బిరెడ్డి అకాల మరణం సెజ్ గ్రామస్తులకు తీరని లోటని సిపిఎం జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్, జిల్లా కమిటీ సభ్యులు డి.శేష బాబ్జి, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు తిరుమలశెట్టి నాగేశ్వరరావు అన్నారు. సుబ్బిరెడ్డి కుటుంబ సభ్యులను సిపిఎం నాయకులు పరామర్శించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సెజ్‌లో భూములు కోల్పోయిన రైతుల పక్షాన నిలబడి పోరాటాలు చేసిన సుబ్బిరెడ్డి సెజ్ గ్రామాల ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటారని తెలిపారు. అధికార యంత్రాంగం కేసులు బనాయించి సెంట్రల్ జైల్లో వేయించినా బాధిత రైతుల పక్షాన నిలబడి పోరాటం చేశారన్నారు. దాని ఫలితంగానే 2000 ఎకరాలను ప్రభుత్వం వెనక్కి ఇచ్చిందన్నారు. పరామర్శించిన వారిలో కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి కె.సింహాచలం, పిఠాపురం కన్వీనర్ కె.చిన్న తదితరులు ఉన్నారు

ఎస్ఇజెడ్‌లో భూములు కోల్పోయిన రైతుల కోసం అండగా ఉండి పోరాట పటిమతో సెజ్ అధికారులను సుబ్బిరెడ్డి గడగడలడించారు. పోలీసుల లాఠీ దెబ్బలకు ఎదరొడ్డి నిలబడిన పెనుమల్లు సుబ్బిరెడ్డి శుక్రవారం ఉదయం అకాల మరణంతో సెజ్ బాధిత గ్రామాలలో విషాద ఛాయలు అలుముకున్నాయి. సెజ్ పోరాటంలో ఆయనపై 30 కేసులు పెటాత్తరు. రాజమండ్రి సెంట్రల్ జైల్లో 140 రోజులు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

ప్రజాశక్తి -యు.కొత్తపల్లి

షార్ట్ సర్క్యూట్‌తో శుక్రవారం రెండు గహాలు దగ్ధం కావడంతో ఎంఎల్ఎ పెండెం దొరబాబు శనివారం బాధిత కుటుంబాలను పరామర్శించి బియ్యం, నగదును అందించారు. నష్టాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వపరంగా ఉచితంగా ఇళ్లమంజూరు చేయిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఆయన వెంట ఎంపిపి కారే సుధా, ఆనాల సుదర్శన్, జ్యోతుల బాబులు, జెడ్‌పిటిసి గుబ్బల తులసి కుమార్, వైస్ ఎంపిపి చెట్టుబత్తిన సురేష్ కుమార్ (నాని), పలువురు ఎంపిటిసిలు సర్పంచులు పాల్గొన్నారు.

శృంగార వల్లభ స్వామికి రూ 2.72 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలో తిరుపతి గ్రామంలోని శ్రీ శంగార వల్లభ స్వామి లయానికి శనివారం ఒక రోజు టిక్కెట్ల ద్వారా రూ.2,09,750, అన్నదాన విరాళాల ద్వారా రూ.53,450, కేశఖండన ద్వారా రూ.9,450 ఆదాయం సమకూరిందని ఆలయ ఇఒ పులి నారాయణమూర్తి తెలిపారు. యాత్రికులకు ఉదయం పులిహోర ప్రసాదం, వేసవిని దృష్టిలో పెట్టుకుని మజ్జిగ పంపిణీ, మధ్యాహ్నం మహా అన్నదానం నిర్వహించామన్నారు. యాత్రికులకు ఆలయ అర్చకులు, సిబ్బంది కష్ణ, సత్యనారాయణ, ప్రజా ప్రతినిధులు కుంచే బుచ్చిరాజు, కర్రి జగదీష్, స్వచ్ఛంద సేవకులు అంజనీ కుమార్, గ్రామస్తులు సేవలందించారన్నారు.

మాజీ ఎంపిటిసికి చిక్కాల పరామర్శ

ప్రజాశక్తి-తాళ్లరేవు

మాజీ ఎంపిటిసి సభ్యుడు గంజా సూరిబాబు భార్య లక్ష్మి అనారోగ్యంతో ఇటీవల మరణించడంతో ఆ కుటుంబ సభ్యులను మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు ఆధ్వర్యాన శనివారం పలువురు నాయకులు పరామర్శించారు. టిడిపి రాష్ట్ర నాయకులు గుత్తులు సాయి, మందాల గంగసూర్యనారాయణ, ధూళిపూడి బాబీ, టేకుమూడి లక్ష్మణరావు, పథ్వి, వాసంశెట్టి శ్రీనివాస్, పిల్లి సత్తిబాబు పరామర్శించారు.

క్రికెట్ టోర్నీ విన్నర్ గాడిమొగ

ప్రజాశక్తి-తాళ్ళరేవు

కోరంగిలో నిర్వహించిన క్రికెట్ టోర్నీలో గాడిమొగ జట్టు విన్నర్‌గా నిలవగా కోరంగి రన్నర్‌గా నిలిచింది. తాళ్ళరేవు మండలం కోరంగి గ్రామపంచాయతీ పరిధిలోని కొత్త కోరంగిలో కోరంగి క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో నాలుగు రోజులపాటు క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. కోరంగి పరిసర ప్రాంతాల నుంచి సుమారు 40 జట్లు పాల్గొన్నాయని నిర్వాహకులు వెంకన్న, పండు, బ్లెస్సీ తెలిపారు. ముఖ్య అతిథిగా కోరంగి ఎస్ఐ శ్రీనివాస్ కుమార్ హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. విన్నర్ బహుమతిని రొక్కం భార్గవ్, రన్నర్ బహుమతిని ఎంజిఆర్ స్పోర్ట్స్, స్పాన్సర్ చేయగా విన్నర్, రన్నర్, జట్లకు దాతలు నగదును అందజేశారు.

తాళ్లరేవు విద్యార్థికి జిల్లా స్థాయి అవార్డు

ప్రజాశక్తి - తాళ్ళరేవు

జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ సిఇసి విద్యార్థి మేడిశెట్టి తేజశ్రీ కోమలాదేవి జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించింది. కాకినాడ జేఎన్టీయూలో జరిగిన ఆణిముత్యాలు కార్యక్రమంలో కాకినాడ కలెక్టర్ కత్తికా శుక్లా నగదు, మెమెంటో, సర్టిఫికెట్ అందజేసినట్లు తల్లిదండ్రులు మేడిశెట్టి అంజిబాబు, చాముండేశ్వరి తెలిపారు. విద్యార్థిని ప్రజాసంఘాల నాయకులు టి.ఈశ్వరరావు తదితరులు అభినందించారు.

నిస్వార్థ నాయకుడు భీమేశ్వరరావు

ప్రజాశక్తి-కాజులూరు

నిస్వార్థ నాయకుడు పేదల పక్షపాతి భీమేశ్వరరావు అని రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్ అన్నారు. శనివారం మండలంలోని శీల గ్రామంలో ఇటీవల మతి చెందిన మాజీ సహకార సంఘం అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ భీమేశ్వరరావు కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఎంపీ చంద్రబోస్ మాట్లాడుతూ గత అనేక ఏళ్ళుగా అనేక పోరాటాల్లో పేదల పక్షాన నిలబడ్డారన్నారు. నిరంతరం గ్రామాభివృద్ధికి కృషి చేశారన్నారు. బడుగు బలహీన వర్గాల సమస్యలు పరిష్కారంలో ఎంతో ముందుండేవారన్నారు.

విద్యా వ్యవస్థలో విప్లవాత్మక విధానాలు

జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో జిల్లాలోని పలుచోట్ల విద్యార్థులకు అవార్డులు, నగదు పురస్కారాలు అందించారు.




మెగా చెక్ అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

ప్రజాశక్తి-యంత్రాంగం

కాకినాడ భావి భారత పౌరుల సమగ్రాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్.జగన్ విద్యా వ్యవస్థలో విప్లవాత్మక విధానాలను అమలు చేస్తున్నారని కాకినాడ ఎంపీ వంగా గీత అన్నారు. శనివారం కాకినాడ జెఎన్‌టియుకె అలూమ్ని ఆడిటోరియంలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో ఎంపీ వంగా గీత, కలెక్టర్ కృతికా శుక్లా, జిల్లా పరిషత్ ఛైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, ఎంఎల్ఎలు ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, కురసాల కన్నబాబు, మాల కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పెదపాటి అమ్మాజీ, కుడా ఛైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, మాజీ మేయర్ సుంకర శివప్రసన్న, వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ అబ్దుల్ బషీరుద్దీన్, జిల్లాపరిషత్ ఇన్‌ఛార్జ్ సిఇఒ ఎ.రమణారెడ్డి, డిఇఒ కెఎన్‌విఎస్ అన్నపూర్ణ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ వంగా గీత మాట్లాడుతూ పిల్లల భవిష్యత్తు కోసం తల్లిదండ్రుల కంటే ఎక్కువగా ఆలోచించే ముఖ్యమంత్రి ఉండటం పిల్లల అదష్టమని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలు, కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు మంచి భవిష్యత్తును సొంతం చేసుకోవాలని సూచిస్తూ ఎంపీ వంగా గీత అవార్డుల విజేతలకు శుభాకాంక్షలు తెలియజేశారు. కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ జిల్లాస్థాయి జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో పదో తరగతి విభాగంలో ఎనిమిది మేనేజ్‌మెంట్ల పరిధిలోని పాఠశాలల నుంచి టాప్-3 ర్యాంకులు సాధించిన విద్యార్థులకు అవార్డులు ప్రదానం చేస్తున్నట్టు తెలిపారు. ఇంటర్మీడియెట్ విభాగంలో ఏడు మేనేజ్‌మెంట్ల పరిధిలోని కళాశాలల నుంచి ఫస్ట్ ర్యాంకర్‌కు గోల్డ్ మెడల్, సర్టిఫికెట్, రూ.50 వేల నగదు బహుమతిని అందిస్తున్నట్టు తెలిపారు. విద్యార్థుల విజయంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల పాత్ర కూడా ఉంటుందని వారి ప్రోత్సాహం వల్లే విద్యార్థులు ఈ స్థాయిలో ప్రతిభ చూపగలిగారని అందుకే పాఠశాలల ప్రధాన ఉపాధ్యాయులను, ర్యాంకర్ల తల్లిదండ్రులను కూడా ఈ సందర్భంగా సత్కరిస్తున్నందుకు చాలా ఆనందంగా ఉందన్నారు. ప్రపంచవ్యాప్త అవకాశాలను అందిపుచ్చుకోవాలనే లక్ష్యంతో విద్యార్థులకు రైజ్ కార్యక్రమం ద్వారా ఇంగ్లీష్ నైపుణ్యాలు పెంపొందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివైఇఒ జిజికె.నూకరాజు, డిసిఒ ఎ.మురళీకష్ణ, జిల్లా గిరిజనసంక్షేమ అధికారి ఎ.విజయశాంతి, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తదితరులు హాజరయ్యారు. **సామర్లకోట రూరల్** ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు వేట్లపాలెం జిల్లా పరిషత్ పాఠశాలలో హెచ్ఎం అనురాధ అధ్యక్షతన నిర్వహించిన కార్యాక్రమంలో విద్యార్థులకు పురస్కారాలు అందించారు. సర్పంచ్ చీమల భవాని పాల్గొన్నారున. బచ్చు ఫౌండేషన్ మునిసిపల్ హైస్కూల్ హెచ్ఎం తోటకూర సాయి రామకష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జె.రామారావు ముఖ్య అతిథిగా, పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ చందలాడ శ్రీనివాసరావు ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో టీచర్లు జి.గోవిందు, కె.అరుణ, కెవివి.సత్యనారాయణ, వి.రాజు, ఎఎల్‌వి.కుమారి, కమిటీ సభ్యులు దాసరి రామాంజనేయులు, వ్యాయామ ఉపాధ్యాయులు తాళ్లూరి వైకుంఠం పాల్గొన్నారు. **రౌతులపూడి** మండలంలోని ములగపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం గాడి కొండబాబు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో జడ్‌పిటిసి లక్ష్మణమూర్తి, కో ఆప్షన్ సభ్యుడు సత్యనారాయణ, వ్యవసాయ సలహా కమిటీ అధ్యక్షులు భాస్కర్‌బాబు, భీమిరెడ్డి కార్తీక్, సీరం లోవ వెంకటలక్ష్మి, అంకంరెడ్డి ముక్తేష్‌కు ఆర్థిక సహాయం అందజేశారు. **పెద్దాపురం** మండలం కాండ్రకోటలోని జిల్లా పరిషత్ హైస్కూల్లో హెచ్ఎం బిఎస్ఎన్ మూర్తి అధ్యక్షతన జరిగిన సభలో ప్రజా ప్రతినిధులు విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి గవరసాన సూరిబాబు, సర్పంచ్ మాకిరెడ్డి శ్రీనివాస్, ఉప సర్పంచ్ జోకా నానాజీ, ఎంపిటిసి జాగు వీరభద్రరావు, గవరసాన బాబ్జి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'





సమావేశంలో మాట్లాడుతున్న పోలీసు అధికారులు

సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

మండలంలోని సీతానగరంలో సైబర్ నేరాలపై ప్రజలకు సిఐ సూర్య అప్పారావు ఆధ్వర్యంలో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. సందర్భంగా సిఐ మాట్లాడుతూ ఫోన్ పే, గూగుల్ పే ద్వారా సైబర్ నేరాలు జరుగుతున్నాయన్నారు. క్యూ ఆర్ కోడ్ ద్వారా స్కాన్ చేస్తే డబ్బులు వస్తాయని మోసపూరిత నేరాలు పాల్పడుతున్నారని, అలాంటివి నమ్మవద్దు అని చెప్పారు. సైబర్ క్రైంపై అందరికీ అవగాహన కలిగి ఉండాలని, నిషేధిత పదార్థాలైన గంజాయి, సారా అమ్మకాలు తయారీ వంటి వాటికి పాల్పడితే తక్షణం పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. గ్రామ పెద్దలు కోడూరు సత్యనారాయణ, ఆత్మకూరు బీమా శంకర్, కాకర్ల కృష్ణాజీ, ఈర్పిన శ్రీనివాస్, వాలంటీర్లు మహిళా పోలీసులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ నిధుల దుర్వినియోగం

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్



సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ నిధులను ఎంఎల్ఎ ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి తన స్వార్థ ప్రయోజనాలు కోసం ఇష్టానుసారంగా దుర్వినియోగం చేస్తున్నారని టిడిపి నగర అధ్యక్షులు మల్లిపూడి వీరు విమర్శించారు. పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో పలువురు పార్టీ నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. జనావాసాల మధ్య ఉన్న డంపింగ్ యార్డును ఎంఎల్ఎ ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి డ్రగ్స్ యార్డుగా మార్చి అక్రమ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారని తమ నాయకులు వనమాడి కొండబాబు పత్రికా విలేకరుల సమక్షంలో ప్రశ్నించారన్నారు. దానికి తమ పార్టీ కట్టుబడి ఉందన్నారు. కాకినాడ నగరంలో జరుగుతున్న డ్రగ్స్ కార్యకలాపాలపై ఎస్‌పికి ఫిర్యాదు చేశామన్నారు. డంపింగ్ యార్డ్‌ను అడ్డాగా చేసుకుని అర్ధరాత్రి వేళలలో క్యాప్ వాహనాలలో ద్వారంపూడి అనుచరులు డ్రగ్స్ సరఫరా చేస్తున్నారన్నారు. క్యాప్ వాహనాలలో డ్రగ్స్ సరఫరాకు క్యాప్ వాహన కార్మికులకు ఎటువంటి సంబంధం లేదని, కార్మికుల సమస్యలపై తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ పోరాటాలు కొనసాగిస్తూ కార్మికులకు అండగా నిలుస్తుందన్నారు. తనపై వస్తున్న డ్రగ్స్ ఆరోపణలను ప్రక్క దోవ పట్టించడానికి ఎంఎల్ఎ ద్వారంపూడి కుటిల రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. మాజీ కార్పొరేటర్ ఒమ్మి బాలాజీ మాట్లాడుతూ కాకినాడ నగరంలో నెలకొన్న ప్రజా సమస్యలపై వనమాడి కొండబాబు ప్రశ్నిస్తే ప్రశ్నించే వారి నాలుకలు కోస్తానని ఎంఎల్ఎ ద్వారంపూడి వంకర మాటలు మాట్లాడుతున్నారని చెప్పారు. నగర ప్రజలు తమ కష్టార్జితాన్ని పన్నుల రూపంలో కార్పొరేషన్‌కు చెల్లిస్తుంటే, కార్పొరేషన్ నిధులను వైసిపి నాయకులు ఏ రకంగా దోచుకు తింటున్నారో కాకినాడ నగర ప్రజలు గ్రహిస్తున్నారని చెప్పారు.

సరిహద్దుల నిర్ణయంపై అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి-కాజులూరు

సరిహద్దుల గుర్తింపులో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కాకినాడ ఆర్‌డిఒ ఎస్‌వివి.సత్యనారాయణ కోరారు. శనివారం మండలంలోని గొల్లపాలెంలో రీ సర్వే సరిహద్దు రాళ్ల ఏర్పాటును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న జగనన్న భూ రక్ష భూ సర్వే కార్యక్రమం విజయవంతంగా జరుగుతోందని, ప్రతి రైతుకూ సంబంధించిన భూముల వద్ద ఎటువంటి వివాదం లేకుండా చూసుకోవాలన్నారు. అనంతరం రైతు భరోసా కేంద్రాన్ని పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు సత్యనారాయణ, ఆర్ఐ వేగేశ్వరరావు, విఆర్ఒ ఈశ్వరరావు, వ్యవసాయ సహాయకులు శిరీష, మాజీ సర్పంచ్ బాబూరావు, పలువురు రైతులు పాల్గొన్నారు.

విద్యుత్ ఛార్జీల మోత.. కోతల వాత..

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

విద్యుత్ బిల్లులు మోత మోగుతున్నాయి. ట్రూ అప్, సర్ ఛార్జీలు తదితర పేర్లతో విద్యుత్ సంస్థలు యదేచ్ఛగా వసూళ్లు చేసుకునేందుకు ప్రభుత్వం అనుమతులు జారీ చేసిన విషయం విదితమే. దీంతో బిల్లులు ఆకాశాన్నంటుతున్నాయి. సాధారణంగా ప్రతి నెలా రూ.900 నుంచి రూ.1000 చెల్లించే గృహ వినియోగదారులు రూ.1500కు పైగా బిల్లులు వచ్చాయి. షాపింగ్ మాల్స్, సినిమా థియేటర్లు, పరిశ్రమల యజమానులు ప్రభుత్వం చుక్కలు చూపిస్తుందంటూ వాపోతున్నారు. మరో వైపు పెరిగిన ఉష్ణోగ్రతల కారణంగా ఒక్కసారిగా డిమాండ్ పెరిగింది. పెరిగిన డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా లేకపోవటతో విద్యుత్ కోతలు అనివార్యంగా మారాయి. దీంతో పల్లెలతో మొదలైన విద్యుత్ కోతలు ప్రస్తుతం పట్టణాల్లోనూ ఎడా పెడా అమలవుతోంది. దీంతో ఉక్కపోతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరో వైపు ఆక్వా రంగానికి విద్యుత్ కోతలు శాపంగా మారాయి. చేపలు, రొయ్యలను బ్రతికించుకునేందుకు లక్షలు వెచ్చించి డీజిల్ మోటార్లతో ఏరియేటర్లతో ఆక్సిజన్ అందిస్తున్నామంటూ నిర్వహకులు వాపోతున్నారు. ప్రజల, అవసరాలకు తగ్గట్లుగా సరఫరా అందించటంలో పాలకులకు చిత్తశుద్ధి కొరవడిందని, బిల్లుల వసూళ్ల పేరుతో వినియోగదారుల గోళ్లూడపీకుతున్నారనే అభిప్రాయం వ్యక్తవవుతోంది.

రహదారులు రక్త సిక్తం...

జాతీయ రహదారులు అంతర్జాతీయ స్థాయిలో ఆధునీకరణ తమ హయాంలోనూ జరుగుతోందంటూ ప్రకటనలు గుప్పిస్తున్న కేంద్ర ప్రభుత్వ డొల్లతనానికి రోడ్డు ప్రమాదాలు దర్పణం పడుతున్నాయి. జిల్లాలో అనేక రహదారులు రక్త సిక్తంగా మారుతున్నాయి. గత వారంలో ఆత్రేయపురం, పోలవరం, చాగల్లు ప్రాంతాలకు చెందిన ఒక కుటుంబం నల్లచర్ల హైవేపై రోడ్డు ప్రమాదంలో మరణించిన విషయం విదితమే. ఈ ఘటనలో రోడ్డుపై లారీ నిలిపిన డ్రైవరును నిందితునిగా చేరుస్తూ పోలీసులు కేసు నమోదు చేసి చేతులు దులుపుకోవటం పలు విమర్శలకు దారి తీస్తోంది. ఉమ్మడి జిల్లాలో సుమారు 50కి పైగా బ్లాక్ స్పాట్‌లు ఉన్నట్లు అధికార యంత్రాంగం చెపుతోంది. ఈ ప్రాంతాలపై ప్రమాదాలకు తీసుకున్న చర్యలు శూన్యమని జరుగుతున్న ప్రమాదాలు దర్పణం పడుతోంది. హైవే పెట్రోలింగ్ వ్యవస్థ అలంకార ప్రాయంగా మారిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. జాతీయ రహదారులకు సమీపంలో డ్రైవర్లకు విశ్రాంత గదులు, మరుగుదొడ్ల నిర్వహణ వంటివి పూర్తిగా నేతి బీర చందంలా మారాయి. ఫలితంగా భారీ వాహనాలు రోడ్డుకు ఇరువైపులా పార్కింగ్ చేసి డ్రైవర్లు విశ్రాంతి తీసుకోవటం పరిపాటిగా మారింది. ఇప్పటికైనా పాలక ప్రభుత్వాలు కళ్లు తెరిచి ప్రమాదాల నియంత్రణకు చిత్తశుద్ధితో చర్యలు చేపట్టాలని బాధిత కుటుంబాలు కోరుతున్నాయి.

ఉలిక్కి పడిన తిరుమల పాలెం

పోలీసు వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం నానాటికి కొరవడుతోంది.రాష్ట్ర వ్యాప్తంగా నేరాలు, ఘోరాలు ఇటీవల కాలంలో ఎక్కువైన విషయం విధితమే. మరో వైపు ఉమ్మడి జిల్లాల్లో జిల్లా కేంద్రాలు నేరగాళ్లకు అడ్డాగా మారిపోయాయనే విమర్శలు లేకపోలేదు. ఈ దుస్థితిని చక్కదిద్దేందుకు చర్యలు చేపట్టాల్సిన పోలీసులు పూర్తి భిన్నంగా వ్యవహరిస్తున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. తాజాగా గోకవరం మండలం తిరుమలపాలెంలో జరిగిన ఘటన ఓ ఉదాహరణగా చెప్పొచ్చు. అంబేద్కర్ విగ్రహం తొలగింపు నేపథ్యంలో అక్కడ జరిగిన అల్లర్లను నియంత్రించేందుకు పోలీసులు వ్యవహరించిన తీరు విమర్శలకు దారి తీసింది. మహిళలు, చిన్నారులను సైతం విచక్షణా రహితంగా దాడి చేశారని అక్కడి స్థానికులు చెబుతున్నారు. గత నాలుగు రోజులుగా బాధితులు ఆస్పత్రిలో వైద్య సేవలు తీసుకోవటం తీవ్రతను దర్పణం పడుతోంది. పోలీసు వ్యవస్థ ఇప్పటికైనా ఆత్మవిమర్శ చేసుకోవాలని ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలు సూచిస్తున్నాయి.

జనసైనికులలో నూతనోత్సాహం కలేనా..?

జనసేన అధినేత పవన్ కళ్యాణ్ జిల్లా పర్యటన ఆ పార్టీ శ్రేణులో ఉత్సాహంతో పాటు నిరుత్సాహం కూడా నింపిందనే అభిప్రాయం ఆ పార్టీ శ్రేణులలో వ్యక్తమవుతోంది. నిర్బంధాలను దాటుకుని పవన్ కళ్యాణ్ చేపట్టిన వారాహి యాత్ర ప్రస్తుతం జిల్లాలో కొనసాగుతోంది. ఈ యాత్రలో జిల్లాతో పాటు ఇతర జిల్లాల నుంచి కూడా కార్యకర్తలను ఆ పార్టీ తరలించింది. ఈ యాత్ర సందర్భంగా తమ అధినేతను కలిసి మాట్లాడవచ్చనే కార్యకర్తల ఆశలపై ముఖ్యనేతలు నీళ్ల చల్లినట్లు తెలుస్తోంది. కొంత మంది నియోజక వర్గ నేతలకు సైతం అధినేతను కలిసే అవకాశం లభించకపోటం విమర్శలకు దారి తీస్తోంది.

గోదారి గలగలలు

నేరాలు ఘోరాలు

కారు ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-కొత్తపేట

కారు ఢీకొని ఒక వ్యక్తి మృతి చెందినట్లు కొత్తపేట అదనపు ఎస్ఐ డి.శశాంక తెలిపారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం రావులపాలెం మండలం ఊబలంక గ్రామానికి చెందిన నాటి శ్రీరాములు, తన భార్య లక్ష్మి ఇద్దరు కలిసి బైకుపై ముమ్మిడివరం తన బంధువుల ఇంటికి వెళ్లి శనివారం మధ్యాహ్నం తిరిగి తన ఇంటికి ఊబలంక వెళ్తుండగా రావులపాలెం నుండి కొత్తపేట వైపు గా వస్తున్న కారు అతి వేగంగా వచ్చి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో భార్యాభర్తలకు బలమైన గాయాలయ్యాయి. వెంటనే స్థానికుల సహకారంతో 108 అంబులెన్స్‌లో స్థానిక ప్రభుత్వాసు పత్రికి తీసుకువెళ్లగా మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శ్రీరాములు (50) మతి చెందాడు. ఈ ఘటనపై భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బైకు చోరీపై ఫిర్యాదు

ప్రజాశక్తి-గండేపల్లి

బొర్రంపాలెం గ్రామానికి చెందిన గురుమాణికుల వెంకటరమణ తన బైకును ఈ నెల 12న తాను పనిచేసే పొలం పక్కన పార్క్ చేసి పని ముగించుకుని వచ్చి చూసేసరికి కనిపించలేదు. ఆయన ఇచ్చిన ఫిర్యాదుపై ఎస్ఐ వై.గణేష్ కుమార్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గాయపడిన వివాహిత మృతి

ప్రజాశక్తి-కాజులూరు

గాయపడి చికిత్స పొందుతూ కాజులూరు గ్రామానికి చెందిన చొల్లంగి లోవ కుమారి (35) మృతి చెందింది. గొల్లపాలెం పోలీసులు చెప్పిన వివరాలు ప్రకారం కాజులూరుకు చెందిన లోవ కుమారి కొద్ది రోజులుగా గుండె సంబంధిత వ్యాధితో బాధ పడుతోంది. ఇటీవల ఆమెకు సర్జరీ జరిగింది. ఈ నెల 14న మంచం పైనుంచి కింద పడగా స్పృహ కోల్పోయింది. కుటుంబ సభ్యులు కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. నాటి నుండి కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మతి చెందిందని తెలిపారు. ఆమెకు భర్త, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ కేసును గొల్లపాలెం ఎస్ఐ తులసీ రామ్ దర్యాప్తు చేస్తున్నారు.

యానాం వార్తలు

గోదావరిలో దూకి వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - యానాం



వీరాస్వామిని కాపాడి తీసుకొస్తున్న మత్స్యకారులు

యానాం జిఎంసి బాలయోగి వారధి పై నుంచి శనివారం ఒక వ్యక్తి గౌతమి గోదావరి నదిలోకి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. చెక్కల అరుణ్ కుమార్ అనే వ్యక్తి చూసి వారధి సమీపంలో బోట్లు రిపేర్ చేసుకుంటున్న మత్స్య కారులకు చెప్పగా నదిలోకి బోటు వేసుకుని వెళ్లి ఆ వ్యక్తిని కాపాడి ఒడ్డుకు చేర్చారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించారు. కాజులూరు గ్రామానికి చెందిన వెలుగుబంట్ల వీరాస్వామిగా గుర్తించారు. చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం కాకినాడకు తరలించారు. అనంతరం పోలీసులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.

26 నుంచి ధ్రువపత్రాల పరిశీలన

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి పోలీస్ రిక్రూట్మెంట్ కానిస్టేబుల్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్లను ఈ నెల 26 నుంచి 28వ తేదీ వరకు పరిశీలిస్తామని పుదుచ్చేరి పోలీస్ శాఖ ఉన్నతాధికారి ఎస్.కుబేర శివకుమరన్ ప్రకటనలో పేర్కొన్నారు. పుదుచ్చేరి గోరిమేడు పోలీస్ శిక్షణ స్కూల్‌కు అభ్యర్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఐదు పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు, పిఇటి అడ్మిట్ కార్డు, రాతపరీక్ష హాల్ టికెట్ తీసుకురావాలన్నారు.

సమీకృత వ్యవసాయ విధానంతో మేలు

ప్రజాశక్తి - తాళ్లరేవు



పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

సమీకత వ్యవసాయ విధానంతో పలు పంటలు సాగు చేయడం మేలని జిల్లా వ్యవసాయ అధికారి ఎన్.విజయకుమార్ తెలిపారు. మండలంలోని చొల్లంగిలో రైతు భరోసా కేంద్రం ద్వారా రైతు నూకరాజు చేపట్టిన సమీకత వ్యవసాయ క్షేత్రాన్ని ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా విజయ్ కుమార్ మాట్లాడుతూ ప్రతి రైతూ ఈ విధానాన్ని అమలు చేస్తే వరితో పాటు ఇతర పంటల దిగుబడితో ఆర్థికంగా రైతులకు లాభం చేకూరుతుందన్నారు. ఈ విధానంలో మొత్తం విస్తీర్ణం ఎకరా 50 సెంట్లకు, 80 సెంట్లలో వరి సాగు (బ్లాక్ రైస్), 20 సెంట్లలో చేపల పెంపకం (కొర్రమీను రకం, గడ్డి చేప, శీలావతి, బాతుల పెంపకం), 10 సెంట్లలో కాలువపై నాటు కోళ్ల పెంపకం, 20 సెంట్లలో కూరగాయల సాగు, ఆకుకూరల సాగు చుట్టూ గట్లపై వివిధ రకాల కరివేపాకు, మునగ, తీపి మొక్కజొన్న, అరటి, బంతి మొదలగునవి, తీగ జాతి పొట్ల, ఆనప, బీర వంటి సాగు, తీగలపై సాగు చేసుకోవచ్చు. 20 సెంట్లు భూమిలో గొర్రెల పెంపకం గడ్డి జాతి పెంపకం చేపట్టవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో కడప సబ్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు కె.బాబూరావు, మండల వ్యవసాయ అధికారి ఎన్.ప్రశాంతి, పద్మజ, వ్యవసాయ అనుబంధ రంగాల సహాయకులు, ఉప సర్పంచ్ స్వర్ణ రాజు, నాయకులు లక్ష్మీనారాయణ, అభ్యుదయ రైతులు స్వర్ణ శ్రీను, శ్రీపాదం సత్యనారాయణ, గండి శ్రీను, స్వర్ణ చెల్లయ్య, బొబ్బర అప్పారావు పాల్గొన్నారు.

వాడపల్లిలో పోటెత్తిన యాత్రికలు

ప్రజాశక్తి-ఆత్రేయపురం

వాడపల్లి ౦కటేశ్వర స్వామి వారి ఆలయానికి శనివారం యాత్రికులు పోటెత్తారు. ఉదయాన్నే వేకువ జామున స్వామివారికి సుప్రభాత సేవ అనంతరం యాత్రికులకు దర్శనాలు కల్పించారు. ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తలెత్తకుండా ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్ రాజు, ఇఒ సత్యనారాయణ రాజు సౌకర్యాలు ఏర్పాటు చేసినప్పటికీ యాత్రికులు పలు ఇబ్బందులు గురయ్యారు. వచ్చిన యాత్రికులకు అన్నదానం నిర్వహించారు. ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా ఆర్‌టిసి పలు జిల్లాల నుంచి బస్సులు నడిపారు. సిఐ రజిని కుమార్, ఎస్ఐ సిహెచ్.సుధాకర్ తన సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు.

కొత్తపేట మందపల్లి గ్రామంలో వేంచేసియున్న మందేశ్వర (శనేశ్వర) స్వామి వారి దేవస్థానం నందు శనివారం శని అమావాస్య సందర్భంగా భక్తులు చెప్తారు ప్రముఖులు స్వామివారిని దర్శించుకున్నట్లు కార్యనిర్వహణ అధికారి సింగం రాధా తెలిపారు. తెల్లవారుజాము నుంచి యాత్రికలు 848 స్వామి వారికి తైలాభిషేకములు జరిపించుకున్నారని అన్నారు. తైలాభిషేకములు మరియు వివిధ ప్రత్యక్ష సేవల ద్వారా రూ.1,33,118 సమకూరిందని అన్నారు. స్వామి వారి అన్నప్రసాదానికి విరాళములు నిమిత్తం రూ.16,624 ఆదాయం వచ్చినట్లు తెలిపారు.

పేదరిక నిర్మూలనే ధ్యేయంగా పాలన

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

పేదరిక నిర్మూలనే ధ్యేయంగా సిఎం జగన్ పాలన సాగిస్తున్నారని ఎంఎల్‌సి బొమ్మి ఇశ్రాయేల్ అన్నారు. పడమరఖండ్రికలో శనివారం ఓ ఫంక్షన్‌కు హాజరైన ఆయన విలేకరులతో మాట్లాడుతూ 75 ఏళ్ల స్వాతంత్ర భారత్ చరిత్రలో ఎస్‌సిలకు సముచిత స్థానం కల్పించిన ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందన్నారు.. ఈ కార్యక్రమంలో మండపేట ఎఎంసి డైరెక్టర్ పలివెల సుధాకర్, తాతపూడి రాజేష్, పలివెల మధు తదితరులు, పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యంతో చదవాలి

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

విద్యార్థులు స్పష్టమైన లక్ష్యంతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని జిల్లా పరిషత్ బాలికొన్నత పాఠశాల హెచ్ఎం మీనా మాధురి సూచించారు. యువజన సర్వీసుల శాఖ, సెట్రాజ్ ఆధ్వర్యాన పాఠశాలలో శనివారం వ్యక్తిత్వ వికాసం, విద్యా ఉద్యోగావకాశాలు అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మీనా మాధురీ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని సూచించారు. విద్యార్థి దశ నుంచే కెరీర్ పైన దష్టి సాధించడానికి స్పష్టమైన లక్ష్యాన్ని ఏర్పరచుకోవడానికి, ఉద్యోగం, ఉపాధి అవకాశాలు పొందడానికి కెరీర్ గైడెన్స్ ఉపయోగపడుతుందన్నారు. అనంతరం మోటివేషనల్ స్పీకర్ ఎ.సత్య శిరీష ఆధ్వర్యాన యువతీయువకులకు వ్యక్తిత్వ వికాసం, విద్యా ఉద్యోగ అవకాశములపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సెట్రాజ్ మేనేజర్ కెఎస్‌వి.కాశీవిశ్వేశ్వరరావు, యువజన సర్వీసుల శాఖ సూపరింటెండెంట్ వి.సూర్యనారాయణ, ఫీల్డ్ ఆఫీసర్ కె.గౌతమ్ పాల్గొన్నారు.



వాటర్ క్యాన్స్ పంపిణీ చేస్తున్న సభ్యులు

వీవర్స్‌కాలనీల్లో మినరల్ వాటర్ పంపిణీ

ప్రజాశక్తి-మామిడికుదురు

మొగలికుదురులో వీవర్స్ కాలనీలో 70 కుటుంబాలకు బద్దె జయప్రకాష్ చిట్టూరి వెంకటరమణ, ఇనుమర్తి మోహనరావు, 20 లీటర్ల వాటర్ టిన్నులు 70 అందించి మానవతా దక్పథం చాటుకున్నారు. వేసవి ఉష్ణోగ్రతల నేపథ్యంలో తాగునీటి కోసం అవస్థలు పడుతున్న విషయాన్ని అంకం నాగ పల్లేశ్వరరావు స్నేహితుల ద్వారా వారికి తెలియపరచడంతో వారు స్పందించారు. మరో మూడు రోజులపాటు ఇదే విధంగా వాటర్ టిన్నులు అందించనున్నారు. వారికి దేవాంగ సంఘం మరియు వీవర్స్ కాలనీ ఎస్‌సి, ఎస్‌టి కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు.

మహిళలు సహకార సంఘాలుగా ఏర్పడాలి

ప్రజాశక్తి-ఆత్రేయపురం

మహిళా డైరీ సహకార సంఘాలుగా ఏర్పడి మహిళలు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ నాతి బుజ్జి అన్నారు. వాడపల్లిలో శనివారం సర్పంచ్ పోచిరాజు బాబురావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ జగనన్న పాల వెల్లువలో భాగముగా పాల ఉత్పత్తి ఎక్కువగా ఉండే గ్రామాల్లో మహిళా డైరీ సహకార సంఘాలను ఏర్పాటు చేసి మహిళలకు పాల ఉత్పత్తుల ద్వారా గిట్టుబాటు ధర రావటానికి మహిళా పాడి రైతుల నుండి వారిలో 12 మందిని ఎంపిక చేస్తామన్నారు. ఈ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశములో ఎంపిటిసి సభ్యులు ఏపుగంటి వీరరాఘవులు, పశువైద్యాధికారి, పంచాయితీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

జూలై 1 నుంచి గ్రహణంమొర్రి చికిత్సలు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్



వివరాలు వెల్లడిస్తున్న వైద్యులు

చిన్నారులు, యువకులకు 'మిషన్ స్మైల్' పేరిట ఉచిత గ్రహణం మొర్రి శస్త్ర చికిత్సలను జూలై 1నుండి 4వ తేదీ వరకు చేస్తున్నట్టు డిఎంఇ డాక్టర్ డివిఎస్ఎల్ నరసింహం, సూపరింటెండెంట్ డాక్టర్ హేమలత దేవి తెలిపారు. శనివారం కాకినాడ ఆసుపత్రిలో విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటి వరకు విజయవాడ, విజయనగరం, విశాఖపట్నంలో మిషన్ల ద్వారా ఇంతవరకు ఆంధ్రప్రదేశ్లో 520 మించి రోగులతో మొత్తం రాష్ట్రంలో 1200కు మించి శస్త్ర చికిత్సలు చేశారని చెప్పారు. జూలై 1వ తేదీన సుమారు 70-80 మంది రోగులు ప్రాథమిక పరీక్షల నిమిత్తం ప్రభుత్వ సామాన్య ఆసుపత్రికి వస్తారని అంచనా వేస్తున్నామన్నారు. అనంతరం జూలై 2 నుండి 4 వరకు అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు జరుగునున్నారు. నాలుగు రోజులలో నిర్వహించే సమగ్ర గ్రహణం మొర్రి శస్త్ర చికిత్సల శిబిరం (మిషన్) ద్వారా ప్లాస్టిక్ సర్జరీ, అనస్థీషియాలజీ, పిడియాట్రిక్స్, డెంటిస్ట్, స్పీచ్ లాంగ్వేజ్, పేథాలజీ, నర్సింగ్ వంటి విభాగాల్లో దేశానికి చెందిన వైద్య నిపుణులతో సుమారు 50 మందికి మించి శస్త్ర చికిత్స అందిస్తామని తెలిపారు. ముత్తూట్ పప్పాచన్ ఫౌండేషన్ (ఎంపిఎఫ్) అవసరమైన సహాయ సహకారాలు అందజేస్తోందన్నారు. రోగులకు ఉచిత రవాణా సదుపాయం, ఆహారం, నివాసం, వైద్య పరీక్షలు, శస్త్ర చికిత్సలు, మందులు అందించనున్నట్లు వెల్లడించారు. శస్త్ర చికిత్స అనంతరం రోగులకు ఉచిత శస్త్ర చికిత్సానంతర సదుపాయాలు కల్పింస్తారని, కాకినాడకు దగ్గరగా ఉన్న జిల్లాలలో సుమారు 35-40 మంది రోగులకు ఆసుపత్రి వర్గాలు గుర్తించామని నరసింహం, హేమలతలు చెప్పారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు జోనల్ హెడ్ మణి కిరణ్, నేషనల్ ప్రోగ్రాం హెడ్ రెహమాన్, వైద్యులు రత్న భూషణ్, విశ్వనాథన్ తదితరులు పాల్గొన్నారు.



సచివాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి

సచివాలయం ప్రారంభం

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

అమలాపురం రూరల్ మండలం జనుపల్లె గ్రామం నందు నూతనంగా రూ.40 లక్షల ఉపాధి హామీ నిధులతో నిర్మించిన గ్రామ సచివాలయం భవనమును శనివారం రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు,గ్రామ సచివాలయ సిబ్బంది, వాలంటరీలు పాల్గొన్నారు.

మున్సిపల్ స్కూల్లో మధ్యాహ్న భోజనం తనిఖీ

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్



భోజనాన్ని రుచి చూస్తున్నఎంఇఒ

సామర్లకోట మున్సిపాలిటీ పరిధిలోని రెండో వార్డులో మున్సిపల్ ఎలిమెంటరీ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ఎంఇఒ వై.శివరామకష్ణయ్య శనివారం తనిఖీ చేశారు. విద్యార్థులు భోజనం చేస్తుండగా వారితో కలిసి భోజన పదార్థాలను రుచి చూసి వాటి నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన హెచ్ఎంతోను, ఇంప్లిమెంటింగ్ ఏజెన్సీ సభ్యులతోను మాట్లాడుతూ విద్యార్థులు రుచికరంగా తినే విధంగా మధ్యాహ్నం భోజనం ఉండేలా చూడాలన్నారు. ప్రతిరోజు ఒక ఉపాధ్యాయుడు భోజనాన్ని రుచి చూసిన తరువాతే విద్యార్థులకు వడ్డించాలన్నారు. మధ్యాహ్న భోజనానికి సంబంధించి మెనూ వివరాలను అందరికీ కనిపించే విధంగా బయట ఏర్పాటు చేయాలని సూచించారు. ఇంప్లిమెంటింగ్ ఏజెన్సీ సభ్యులు ఏదైనా పని ఉండి సెలవు పెట్టాల్సి వస్తే ముందుగా సంబంధిత పాఠశాల హెచ్ఎంలకు సమాచారం అందించాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ వెంట పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయ సిబ్బంది ఉన్నారు.

మార్కెట్ సమస్యలపై వినతి

ప్రజాశక్తి రామచంద్రపురం

గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పురపాలక సంఘం 12వ సచివాలయం పరిధిలోని 25వ వార్డులో గడప..గడపకూ కార్యక్రమంలో పలువురు మార్కెట్లో అసౌకర్యాల గురించి మంత్రి వేణుదష్టికి తీసుకువచ్చారు. 25వ వార్డులో ఉన్న మార్కెట్ ను సందర్శించి అక్కడ సమస్యలను స్థానిక వర్తకులు నుండి అడిగి తెలుసుకున్న మంత్రి మార్కెట్లో మౌలిక సదుపాయాల కల్పన చేయాలని షాపుల్లో చేపట్టవలసిన మరమ్మతు పనులు చేపట్టాలని మునిసిపల్ కమిషనర్ కె.శ్రీకాంత్ రెడ్డికు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రామచంద్రపురం పురపాలక సంఘం కమిషనర్ కే. శ్రీకాంత్ రెడ్డి , 25వ వార్డు కౌన్సిలర్ కోటిపల్లి లక్ష్మి శివాజీ ఇతర కౌన్సిలర్లు ప్రజా ప్రతినిధులు సచివాలయ సిబ్బంది తదితరులుపాల్గొన్నారు.

బాల బాలాజీ స్వామిని దర్శించుకున్న సివిల్ జడ్జి

ప్రజాశక్తి - మామిడికుదురు



ఆలయంలో పూజలు చేస్తున్న జడ్జి

అప్పనపల్లి బాల బాలాజీ స్వామిని రాజోలు జూనియర్ సివిల్ జడ్జి కె.హిమ బిందు కుటుంబ సభ్యులతో కలసి శనివారం దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు మద్దాలి తిరుమల సింగరాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి చిత్రపటం ప్రసాదములు అందజేసినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ జి. మాధవి తెలిపారు. శనివారం స్వామి వారి దేవస్థానం నకు వివిధ టిక్కెట్లు విక్రయాల ద్వారా రూ.లక్ష 61వేల 197, మరియు నిత్యాన్నదాన ట్రస్ట్‌కు రూ.50వేల 600 మొత్తం రూ.2,11, 805 ఆదాయం వచ్చిందన్నారు. 3096 మంది యాత్రికులు స్వామివారిని దర్శించుకోగా 2,471 మంది అన్నప్రసాదం స్వీకరించారని ఆలయ ఎసి తెలిపారు. ఆలయ చైర్మన్ చిత్తూరు రామకృష్ణ మరియు సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.